RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 273 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | బుధవారం, ఆగస్టు, 19, 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

### హరీశ్‌రావు కాదు.. అబద్దాల రావు..

హైదరాబాద్, ఆగస్టు 18 : మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. హరీశ్‌రావు కాదు ఆయన అబద్దాల రావు అని ఎద్దేవా చేశారు. 22ఏ లో ఆయన కొండను తవ్వి ఎలుకను పట్టారని.. దాన్ని గొప్పగా చెప్పుకుంటు న్నారని సెటైర్లు గుప్పించారు. ఈరోజు (మంగళవారం) ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మంత్రి పొంగులేటి మాట్లాడారు. విమర్శలు చేసే ముందు బుర్ర కూడా ఉపయోగించాలని మంత్రి వ్యగ్యంగా మాట్లాడారు. ఎవరికీ అన్యాయం జరగనివబోమని అన్నారు. ప్రభుత్వ భూములు కాకపోతే కచ్చితంగా వాటిని 22ఏ నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో మాదిరిగా తాము బుకాయించడం లేదని చెప్పారు.

### సీజేపీ ఆందోళనపై హైపవర్ కమిటి :సుప్రీం

**న్యూఢిల్లీ,ఆగస్టు 18:**ఢిల్లీలో జూలై 20న జరిగిన నీట్ నిరసనల సందర్భంగా విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాలు, అక్రమాలపై విచారణ జరిపేందుకు ఒక హై పవర్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది.

రిటైర్డ్ న్యాయమూర్తులు, మాజీ డీజీపీ, సీబీఐ మాజీ డైరెక్టర్లతో కూడిన ఈ కమిటీ నిరసనల రోజు నాటి సీసీటీవీ, వీడియో దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుందని చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం వెల్లడించింది.

ప్యానెల్‌లో చేర్చాల్సిన ఇతర సభ్యులపై వివిధ పార్టీల నుంచి సూచనలు అందిన తర్వాత, కమిటీని ఏర్పాటు చేసేందుకు సంబంధించిన ఉత్తర్వులను బుధవారం విడుదల చేస్తామని ధర్మాసనం తెలిపింది. కమిటీకి మౌలిక సదుపాయలను సుప్రీంకోర్టు కల్పించనుంది.

## అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీ

### బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్



విశాఖపట్నం, ఆగస్టు18: కార్యకర్త నుంచి జాతీయ నాయకుడిగా ఎదిగిన భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పోరాటాల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే బీజేపీ అతి పెద్ద పార్టీగా ఉందని అన్నారు. దేశాన్ని మరింత శక్తిమంతంగా చేయడానికి సంకల్పం తీసుకోవాలని ప్రతి కార్యకర్తకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో మంచి పాలన అందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమికి మంచి విజయాన్ని అందించిన ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించడానికి కూటమి ఏర్పాటైందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని అన్నారు. అంధ్రప్రదేశ్‌పై ప్రధాన మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారని గుర్తు చేశారు. తమ కలలను సాకారం చేసే పార్టీని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. అనేక ప్రాజెక్టులు ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి డబల్ ఇంజిన్ సర్కార్ పని చేస్తుందని అన్నారు.

## దిగొచ్చిన హేమంత్ సర్కార్.. విద్యార్థుల డిమాండ్లకు అంగీకారం!

జార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల విషయంలో విద్యార్థుల ఆందోళనకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లక్నోకు చెందిన టీడీపీఎల్ నిర్వహించిన అన్ని పరీక్షలు, నియామకాలను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటించారు. అయితే విద్యార్థులు మాత్రం సీబీఐ దర్యాప్తు చేపట్టాలన్న తమ డిమాండ్‌పై వెనక్కి తగ్గడం లేదు. వారాలుగా జార్ఖండ్‌లో విద్యార్థులు పరీక్షలు, నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విద్యార్థులతో సమావేశమై పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. టీడీపీఎల్ నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన ఫలితాలతో పాటు ఆ సంస్థ ద్వారా ఎంపికైన అభ్యర్థులు, పరీక్షల్లో పాల్గొన్న ప్రక్రియ, సంస్థ చేపట్టిన అన్ని కార్యకలాపాలను రద్దు చేస్తున్నట్లు సోరెన్ తెలిపారు. "టీడీపీఎల్ ప్రచురించిన ఫలితాలు, ఆ సంస్థ ద్వారా ఎంపికైన అభ్యర్థులు లేదా పరీక్షల్లో పాల్గొన్న అభ్యర్థులకు సంబంధించిన ప్రక్రియ.. ఇక్కడ టీడీపీఎల్ చేపట్టిన అన్ని కార్యకలాపాలను రద్దు చేయాలి" అని సీఎం స్పష్టం చేశారు. ఇదే సమయంలో జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ) నిర్వహించిన



పరీక్షలు, జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (జేఎస్ఎస్‌సీ సీజీఎల్) పరీక్షలను కూడా రద్దు చేయనున్నట్లు హేమంత్ సోరెన్ వెల్లడించారు. పరీక్షలు, నియామకాలకు సంబంధించి విద్యార్థులు చేస్తున్న ఆరోపణల

## మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 8 మంది మృతి, 32 మందికి గాయాలు

భోపాల్, ఆగస్టు 18:మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై ఉన్న ఆవులను తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న డంపర్ ట్రక్కును ఢీకొట్టడంతో ఎనిమిదిమంది కూలీలు మృతి చెందారు. మరో 32 మంది గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన భింద్-గ్వాలియర్ జాతీయ రహదారిపై చిమ్కా గ్రామం సమీపంలో రాత్రి సుమారు 1 గంటకు ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివారలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ గ్రామస్తులు గ్వాలియర్‌లో వరి నాట్లు వేసే పని పూర్తి చేసుకుని తిరిగి తమ గ్రామానికి వెళ్తున్నారు. కూలీలు ప్రయాణిస్తున్న వాహన డ్రైవర్ రహదారిపై ఉన్న ఉన్న పశువులను తప్పించబోయే క్రమంలో వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో ఎదురుగా వస్తున్న డంపర్ ట్రక్కును ఢీకొట్టడంతో ఎనిమిది మంది మరణించారని గోహద్ చౌరాహా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ రామ్‌నరేశ్ యాదవ్ తెలిపారు. వీరిలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ముగ్గురు దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యలో ప్రాణాలు



కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారందరినీ వెంటనే గోహద్‌లోని హాస్పిటల్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్.. 85 శాతమే వర్షపాతం

హైదరాబాద్ : ప్రయివేటు వాతావరణ సంస్థ స్కైమెట్, 2026 నైరుతి రుతుపవనాలపై ఆందోళనకర అంచనాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా వర్షపాతం దీర్ఘకాల సగటు (ఎల్‌పీఏ)లో కేవలం 85 శాతం మాత్రమే నమోదవుతుందని, దీంతో కరువు ముప్పు 70 శాతానికి పెరిగిందని స్పష్టం చేసింది. ఏప్రిల్‌లో 94 శాతం వర్షపాతం ఉంటుందని అంచనా వేసిన సంస్థ, తాజా పరిస్థితులతో తన అంచనాను గణనీయంగా తగ్గించింది. బలపడుతున్న ఎల్ నినో పరిస్థితుల కారణంగానే ఈ సవరణ చేసినట్లు స్కైమెట్ తెలిపింది. సెప్టెంబర్ నాటికి ఇది 'సూపర్ ఎల్ నినో' స్థాయికి చేరవచ్చని స్కైమెట్ మేనేజింగ్ డైరెక్టర్ జతిన్ సింగ్ పేర్కొన్నారు.ఆగస్టులో 84 శాతం, సెప్టెంబర్‌లో 80 శాతం మాత్రమే వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. ముఖ్యంగా దక్షిణ ద్వీపకల్పంలో 21 శాతం లోటు నమోదవగా, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోనూ వర్షపాతం తక్కువగా ఉన్నట్లు



గణాంకాలు చెబుతున్నాయి. తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో ఈ లోటు ఏకంగా 27 శాతంగా ఉంది.

## జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి.. రూ. 15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

**- నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న శ్రీధర్ బాబు-కాన్ఫరెన్స్ ను నిర్వహించిన నిర్మలా సీతారామన్, పీయూష్ గోయెల్- స్మార్ట్ సిటీ పనులను 2028 నాటికి పూర్తి చేస్తామన్న మంత్రి శ్రీధర్ బాబు**

**న్యూఢిల్లీ,ఆగస్టు 18:**తెలంగాణ పారిశ్రామిక రంగానికి జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఒక కొత్త ఊపునివ్వనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ స్మార్ట్ సిటీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. 3,245 ఎకరాల భారీ విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఈ స్మార్ట్ సిటీ ద్వారా సుమారు రూ. 15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య-పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్‌లు సంయుక్తంగా నిర్వహించిన 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నింటినీ 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో జరుగుతున్న ఈ పనులను గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో తెలంగాణ ప్రభుత్వ వాటా 51 శాతం ఉండగా, మౌలిక



వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇదే క్రమంలో, 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) కింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌ను ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు కోరారు.

## ఆ భూములను లాక్కుంటే.. చూస్తూ ఊరుకోం.. రేవంత్ సర్కార్‌కు కవిత వార్నింగ్

హైదరాబాద్, ఆగస్టు 18 : తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి సర్కార్ లాక్కుంటే.. చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం సామాజిక న్యాయం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని కవిత పేర్కొన్నారు. ప్రభుత్వం నియమించిన అడ్వైజర్ల జీతాల విషయంలోనే సామాజిక న్యాయం ఎందుకు కనిపించట్లేదని నిలదీశారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం ఆటవికా న్యాయమా..? అని ప్రశ్నించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే



ఓ రకమైన చర్యలు.. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా..? ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం.? అని ప్రశ్నల వర్షం కురిపించారు.

## మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష..

### పొంగులేటిపై హరీశ్ ఫైర్

మల్కాజిగిరి, ఆగస్టు 18: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్‌ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష? పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తప్పు చేశారు.. సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా? ఇది 30% గవర్నమెంట్... ఏ పని కావాలన్నా 30% కమీషన్ అడుగుతున్నారు' అంటూ విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో ఉందని.. మరి సీఎం ఎక్కడ మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారో చెప్పాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్టర్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిషేధిత భూములతో పాటు ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందని



ఆరోపించారు. నిషేధిత జాబితాల నుంచి తొలగించిన భూముల లిస్ట్‌ను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి కలిసి కుట్ర చేస్తున్నారని.. తప్పు వారు చేసి అధికారులపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.'అధికారులూ జాగ్రత్త.. మీరు తప్పు చేస్తే రేపు మీరే బలవుతారు. మీ కమీషన్ల కోసం పెన్ను పోటుతో ప్రజల జీవితాలను బలి చేయొద్దు. రేపు ఎప్పుడు అసెంబ్లీ పెట్టినా నిషేధిత భూములపై ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నిలదీస్తుంది.. ప్రజలకు అండగా ఉంటుంది. ప్రజల ఆస్తులపై మీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తామంటే పాతర వేస్తారు. ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్ పనిచేయట్లేదు... మీ జనతా గ్యారేజ్ తెలంగాణ భవన్ ఎప్పుడూ మీకోసం తెరిచే ఉంటుంది' అని హరీశ్ రావు పేర్కొన్నారు.

## మహాత్మా గాంధీపై కూడా కేసు పెట్టండి

### ఖర్గే కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 18:**ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో 'వందేమాతరం' గేయాలాపనకు అంతరాయం కలిగించేందుకు యత్నించారంటూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై దాఖలైన పోలీసు ఫిర్యాదుపై కాంగ్రెస్ అధిష్టానం స్పందించింది. ఈ వివాదంపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీని తీవ్రంగా విమర్శించారు. "ఒకవేళ వందేమాతరం అంశంపై కేసులు నమోదు చేయాలనుకుంటే ముందుగా మహాత్మా గాంధీపై కూడా కేసు నమోదు చేయాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వందేమాతరం గేయం ఆలాపిస్తున్న సమయంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గేల మధ్య సంభాషణలు, సైగలు జరిగాయని, ఇది జాతీయ గేయాన్ని అసమానించడమేనంటూ బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. అనంతరం ఈ విఘాతంపై సోనియా, రాహుల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పందిస్తూ.. 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే జాతీయ గేయంగా స్వీకరించాలని నిర్ణయించిందని, ఆ కమిటీ సమావేశానికి



మహాత్మా గాంధీ కూడా అధ్యక్షత వహించారని గుర్తుచేశారు. అందువల్ల వందేమాతరం విషయంలో ఫిర్యాదులు చేయాలనుకుంటే, ఆనాడు చారిత్రక నిర్ణయం తీసుకున్న మహాత్మా గాంధీతో పాటు ఇతర స్వాతంత్ర్య సమరయోధులపై కూడా కేసు నమోదు చేయాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, జాతీయ ఆర్ఎస్ఎస్ (=టూ) వేదికలపై 'వందేమాతరం' పాడకుండా కేవలం తమ ప్రార్థనలకే ప్రాధాన్యత ఇస్తారని, అలాంటిది బీజేపీ నేతలు కాంగ్రెస్‌కు దేశభక్తి పాఠాలు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

# సంపాదకీయం

## సమాజానికి చీడలా..డ్రగ్స్ మహమ్మారి

ఉడ్తా పంజాబ్... పేరుతో ఆనాడు గోలగోల జరిగింది. పంజాబ్ మాదక ద్రవ్యాలకు నిలయంగా మారింది. అక్కడ యువత పెడదారి పడుతోందని దేశవ్యాప్తంగా ఆందోళన వెల్లువెత్తింది. దీనిపై సినిమాలు వచ్చాయి. ఇప్పుడు దేశంలో ఎక్కడో ఒకచోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగిస్తోంది. గంజాయి మత్తులో అనేకానేక హత్యాచారాలు జరిగాయి. ఇటీవల మదనపల్లెలో ఓ దుండగులు బాలికను హత్యాచారం చేసిన సంగతి చూశాం. మద్యం, మత్తు పదార్థాలు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నా పాలకులు పట్టించు కోవడం లేదు. కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చి పోతున్నాయి. నిత్యం కాపలా కాసి పట్టుకుంటున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. రేవ్ పార్టీలు, ఫామ్ హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాప్రతినిధులే డ్రగ్స్ స్వీకరిస్తే సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు. మొయినా బాద్ ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేశ్‌లు పట్టుబడడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి వారిని రాజకీయాల నుంచి తరిమేయాలి. ఇలాంటి వారిని ప్రజాజీవితానికి దూరం చేయాలి. మొగ్గలోనే తుంచే యాలి. ఇలాంటి వారు మళ్లీ రాజకీయ జీవితంలోకి రాకుండా కఠిన ఆంక్షలు విధించాలి. ఇలాంటి వారి వల్లనే నేర సామ్రాజ్యం విస్తరిస్తుంది. డ్రగ్స్ ఎంతటి దారుణానికైనా తెగించేలా చేస్తుంది. హైదరాబాద్ నగర శివార్లలోని మొయినాబాద్ అజీజ్ నగర్ లో గల మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్ లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్, ఫోర్త్ సిటీ పోలీసులు గుట్టురట్టు చేయడం వెనుక భారీ ఆపరేషన్ కొనసాగింది. ఈ పార్టీలో ప్రముఖులు వున్నట్లు, ఇందులో డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దీనిపై స్థానిక పోలీసుల సహకారంతో గత రాత్రి పది గంటల సమయంలో దాడులు చేయడం తెలిసిందే. ఈ సమయంలో అక్కడ ఒక మహిళతోపాటు 11 మంది వున్నారు. వీరంతా మద్యం మత్తులో వుండగా కొందరు డ్రగ్స్ సేవించినట్లు అనుమానాలు వుండడంతో అందరికి డ్రగ్స్ పరీక్షలు జరిపారు. ఇదే సమయంలో వాష్ రూం వద్ద చేతిలో ఎ32 కాలిబర్ రివాల్వరన్ను పట్టుకుని వుండగా అతన్ని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అతని పేరు నమిత్ శర్మగా తేలింది. ఇతని చేతిలో వున్న రివాల్వర్ జర్మనీలో తయారైనట్లు తేలింది. ఇతనికి సమీపంలో మరో వ్యక్తి ఖాళీ తూటా పట్టుకుని వుండగా అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇతన్ని సిల్వేరి శరత్‌కుమార్గా గుర్తించారు. ఇతని వద్ద 26 గ్రాముల కొకైన్, భారీగా మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఘటనా స్థలంలో తూటాతో పాటు మొత్తం 4 ఖాళీ తూటాలు లభ్యమయ్యాయి. రివాల్వర్ తోపాటు తూటాను, ఖాళీ తూటాలను పరీక్షల నిమిత్తం ఎఫ్ఎస్ఎల్‌కు పరీక్షల నిమి త్తం పంపారు. ఎక్కడో యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఈ దురలవాటు మెల్లగా మనదేశంలోకి అడుగుపెట్టి ఆందోళనకు గురి చేస్తోంది. మెక్సికోలో డ్రగ్స్ మాఫియా డాన్ ఎలా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడో ఇటీవలే చూశాం. అతడిని ఎన్‌కౌంటర్ చేశరు. అలాగే ఇక్కడి నేరాలను కూడా ఆదిలోనే అదుపు చేయకపోతే సమాజానికి క్యాన్సర్‌లా పట్టిపీడిస్తుంది. 1980లో ఎల్మెంచో కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికాడు. కొంతకాలం జైలుశిక్ష కూడా అను భవించాడు. తిరిగి మెక్సికోకి వచ్చాక కొన్నాళ్లు పోలీసుగా పనిచేశాడు. ఆపై అన్ని మెళకువలు తెలుసుకున్నాకదాన్ని వదిలిపెట్టి 2009లో తన డ్రగ్ మాఫియాకు ప్రాణం పోసాడు. అనూహ్యంగా ఆ ముఠా 2015లో 20 మంది పోలీసుల్ని తలలు నరికి చంపేసింది. అప్పట్నించిమెంచో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలోకి చేరి పోయాడు. ఎల్మెంచో వద్దనున్న ఆయుధ సంపత్తి అలాంటిలాంటిది కాదు. సాయుధ వాహనాలు, రాకెట్ లాంఛర్లు, భారీ ఎత్తున ఆయుధాలను కూడా మెక్సికో సైన్యం స్వాధీన పరుచుకొంది. అతని ముఠాలో ఉన్న వాళ్లంతా కిరాయి హంతకులుగా పేరుపడిన వారే. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వాధి కారుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేవాడు. ఈ ముఠా మెక్సికో సైన్యానికి సవాల్‌గా మారింది. అతడి నేర సామ్రాజ్యాన్ని పెంచిపోషించిన వారెవరో అందరికీ తెలుసు. ఇది ప్రపంచానికి ఓ గుణపాఠం కావాలి. తెలంగాణ మాజీ న క్సలైట్ నయీమ్‌ను పెంచి పోషించిందెవరో అందరికీ తెలుసు. ఇలా నేరగాళ్లను ప్రోత్సహించడం వల్ల సమాజం ఛిద్రం కాగలదని గుర్తించాలి. అందుకే నేర స్వభావం ఉన్న వారికి ఏ రూపంలోనూ సకహరించ కూడదు. భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో పాటు అతని స్నేహితుడు నమిత్‌శర్మల మత్తు చరిత్ర కొత్త అనుమానాలు రేకెత్తి స్తోంది. మత్తు మందులు వాడే అలవాటు వీరికి గతంలోనూ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దిల్లీ వాసి నమిత్‌శర్మ, ఏలూరు ఎంపీ మహేశ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు కూడా లభించడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. వాస్తవానికి తాజా కేసు దర్యాప్తుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికీ మత్తు మందుల సరఫరా మూలాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే పోలీసులు పాత విషయాలనూ తవ్వితీయబోతున్నారు. పార్టీలో తాము డ్రగ్స్ వాడలేదని నిందితులు తొలుత బుకాయించినప్పటికీ పోలీసుల పరీక్షల్లో మొత్తం 11 మందిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇందులో నమిత్‌శర్మ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్, కొకైన్ ఆనవాళ్లు లభించాయి. పుట్టా మహేశ్ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్ ఆనవాళ్లు దొరికాయి. మిగతా నలుగురూ కొకైన్ వాడినట్లు తేలింది. పోలీసులు ప్రశ్నించినప్పుడు తాను సిమ్లా నుంచి కొకైన్ తీసుకొచ్చా నని బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి వెల్లడించాడు. వారి సోదాల్లోనూ కొకైన్ మినహా ఇతరత్రా మత్తు మందులేవీ అక్కడ దొరకలేదు. కానీ, నమిత్‌శర్మ, పుట్టా మహేశ్‌ల నమూనాల్లో మాత్రం ఇతర మాదక ద్రవ్యాల ఆనవాళ్లు లభించాయి. వారిద్దరూ వీటిని జరిగిన పార్టీలో తీసుకున్నారా...? అంతకు ముందే వాడారా..? అనే వివరాలన్నీ తదుపరి దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు చెబుతున్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో చిక్కిన వారందరికీ కొంతకాలంగా మత్తుమందులు వాడే అలవాటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. పరీక్షలు చేసినపుడు ఆరుగురు డ్రగ్స్ వాడగా, అందులో ఐదుగురు కొకైన్ తీసుకున్నట్లు తేలింది. మొత్తంగా ఈ కేసుతో పాటు గతంలో పట్టుబడ్డ కేసులను కూడా విచారించాలి. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డవారు డ్రగ్స్ పార్టీలకు అలవాటు పడుతున్నారు. తెలంగాణ లో గతంలో సినీ రంగాన్ని కూడా మాదకద్రవ్యాల కేసు ఓ కుదుపు కుదిపింది. కానీ ఆ కేసు ఆచూకీ లేకుండా పోయింది. వీటిని ఇలాగే వదిలేస్తే రేపు సమాజానికి సవాల్‌గా మారుతుందని గుర్తించాలి.

**పబ్లిషర్ : కొక్కు రవికుమార్**



# వాతావరణ సంక్షోభం వైపు భారత్

మన దేశం బహుళ వాతావరణ సంక్షోభం అంచులపై ఉంది. గణాంకాలు, అనుభవాలు, రోజువారీ జరుగుతున్న సంఘటనలు ఈ వాస్తవాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఈ సంక్షోభం ఒక్కసారిగా ఉద్భవించింది కాదు, సంవత్సరాలుగా కూడబెట్టుకున్న పర్యావరణ నిర్లక్ష్యం, అభివృద్ధి నమూనాల్లోని అసమతుల్యతల ఫలితమే అన్నది ఛేదు నిజం. భారత వాతావరణ విభాగం ప్రకారం 2025 సంవత్సరం దేశ చరిత్రలో ఎనిమిదవ అత్యంత వేడిమి సంవత్సరంగా నమోదైంది. సగటు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.28డీజ అధికంగా నమోదయ్యాయి. ఈ సంఖ్య చిన్నదిగా కనిపించినా, వాతావరణ శాస్త్రంలో ఇది తీవ్రమైన మార్పులకు సంకేతం. ముఖ్యంగా 2016--2025 దశకం దేశ చరిత్రలోనే అత్యంత వేడి కాలంగా నిలవడం పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టంగా చూపుతోంది. 2026లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. మార్చి నెల నుంచే పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4డీజ నుంచి 8డీజ వరకు అధికంగా నమోదవుతున్నాయి. వసంత కాలం క్రమంగా క్షీణించి, వేసవి ముందుగానే దాడి చేస్తోందన్న నిపుణుల అభిప్రాయం దీనికి బలం చేకూరుస్తోంది. 2025 సంత్సరంలో దాదాపు 330కి పైగా రోజుల్లో దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట తీవ్రమైన వాతావరణ ఘటనలు నమోదయ్యాయి. తొలి తొమ్మిది నెలల్లో 99% రోజుల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం, ఈ పరిస్థితి ఎంత సాధారణంగా మారిందో తెలియజేస్తోంది. ఈ ఘటనల ఫలితంగా 4,000కు పైగా ప్రాణ నష్టం సంభవించగా, 94.7 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు నష్టపోవడం జరిగింది. లక్షకు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. వాతావరణ మార్పు అనేది ఒకే ఒక్క విపత్తుగా కాకుండా, నిరంతర సంక్షోభంగా మారిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉష్ణోగ్రతలలో తేడా.. పెరిగిన వడగాలుల తీవ్రత...: దేశంలో ఉష్ణోగ్రతల పెరుగుదలతో వడగాలుల తీవ్రత గణనీయంగా పెరిగింది. వాతావరణ విభాగం గణాంకాలను పరిశీలిస్తే 2015లో కేవలం 9 రాష్ట్రాల్లో నమోదైన వడగాలులు, 2020 నాటికి 23 రాష్ట్రాలకు విస్తరించాయన్నది విధితమవుతుంది. దేశంలో వడగాలుల రోజులు 7.4 నుంచి 32.2కు పెరిగాయి. ప్రతి సంవత్సరం 1,000 మందికి పైగా వడగాలుల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలోని సుమారు 57% జిల్లాలు తీవ్రమైన వేడి ప్రమాదంలో ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. తాజాగా శాస్త్రీయ విశ్లేషణలు కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మానవ శరీరం తట్టుకోలేని స్థాయికి చేరుతున్నాయని హెచ్చరిస్తున్నాయి. ఇది కేవలం పర్యావరణ సమస్య కాకుండా, ప్రజా ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా మారుతోంది.

వ్యవసాయ రంగం పై ప్రభావం...: వ్యవసాయం రంగం కూడా ఈ మార్పుల బారిన పడుతోంది. దేశ జనాభాలో 45% మంది వ్యవసాయంపై ఆధారపడుతున్నప్పటికీ, రుతుపవనాల అస్థిరత రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెడుతోంది. వర్షపాతం విషయానికొస్తే సమయపాలన లోపించడం, అధిక వర్షాలు పంటల వైఫల్యానికి దారి తీస్తున్నాయి. 2026లో మాన్సూన్ సాధారణం కంటే సుమారు 94% స్థాయిలోనే ఉండే అవకాశమున్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. ఇక 40% జిల్లాల్లో వరద ప్రాంతాలు క్రమంగా కరవు ప్రాంతాలుగా మారుతున్నాయి. ఇలాగే కొనసాగితే దీర్ఘకాల కరవు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. వేడెక్కుతున్న సముద్రాలు.. కరుగుతున్న హిమానీ నదాలు...: మన దేశం మూడు వైపులా ఉన్న సముద్రాలు వేడెక్కడం మరో ప్రధాన ఆందోళన. సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదలతో తుపానుల తీవ్రత పెరుగుతోంది. సముద్ర మట్టం పెరగడం వల్ల తీరప్రాంతాల్లో వరదలు అధికమవుతున్నాయి. 1995--2024 మధ్యకాలంలో ప్రపంచంలో అత్యధిక వాతావరణ ప్రభావిత దేశాల్లో భారత్ టాప్-10లో ఉండ టం ఈ ప్రమాదం స్థాయిని తెలియజేస్తోంది. మరోవైపున హిమాల యాల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. హిమనీనదాల కరుగుదల వేగవంతమవుతోంది. దీని ఫలితంగా నదుల ప్రవాహం అస్థిరంగా మారే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో సాగునీటి కొరత, తాగునీటి సమస్యలు, వలసలు పెరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముంది. ఇటీవల హిమాలయ ప్రాంతాల్లో కూడా వడగాలుల ప్రభావం కనిపించడం కొత్త హెచ్చరికగా భావించాలి.

ప్రజల అనుభవాల్లోనూ...: వాతావరణ మార్పు ప్రభావం కేవలం గణాంకాల్లోనే గాక ప్రజల అనుభవాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని సర్వేలు చెబుతున్నట్లు దేశంలో 71% మంది తీవ్ర వడగాలులను అనుభవించగా, 52% మంది నీటి కొరతను ఎదుర్కొంటున్నారు, అలాగే 34% మంది వరదలను చూశారు. వాతావరణ మార్పు ఇప్పుడు ప్రజల రోజువారీ జీవితాల్లో ప్రత్యక్ష వాస్తవంగా మారింది.

తక్షణ చర్యలు అవసరం...: ఈ మొత్తం దృశ్యం ఒకే సందేశాన్ని ఇస్తోంది. వాతావరణ మార్పు భవిష్యత్తు సమస్య కాదు; ఇది ఇప్పటికే దేశాన్ని ప్రభావితం చేస్తున్న సంక్షోభం. ఉష్ణోగ్రతల పెరుగుదల వెనుక ఆర్థిక నష్టం, ఆహార భద్రత సమస్యలు, ఆరోగ్య సంక్షోభం, సామాజిక అసమానతలు అన్నీ దాగి ఉన్నాయి.

# భూసేకరణలతో రైతుల గుండెల్లో రైళ్లు !



రాజధాని అమరావతికి ఇప్పటికే 32వేల ఎకరాలు సేకరించారు. మరో దశలో భూసేకరణకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు సరైన పరిహారం దక్కలేదు. ప్లాట్లు కూడా దక్కలేదు. కౌలు కూడా అరకొరగా అందచేస్తున్నారు. అయినా రైతులు రాజధాని కోసం సర్వస్వం త్యాగం చేశారు. మరిన్ని భూములు సేకరించే ప్రయత్నంలో కొంత వ్యతిరేకత తప్పడం లేదు. మూడు పంటలు పండే, కృష్ణా పరివాహక భూములు ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారు. రైతులకు మంచి ధరలు ఇచ్చి కొనడంలో కూడా సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోంది. గతంలో ఇచ్చిన భూముల రైతులకు పెద్దగా దక్కింది కూడా లేదు. ఇప్పుడది చాలదన్నట్టు 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 189 కిలోమీటర్ల పొడవున 250 మీటర్ల వెడల్పుతో ఔటర్ రింగురోడ్డు ఒఆర్ఆర్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాల రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల నుండి ఇబ్రహీంపట్నం వరకూ కృష్ణానదికి సమీపంగా ఒఆర్ఆర్ నిర్మిస్తామంటూ అక్కడి భూయజమానులతో ఇటీవల అధికారులు చెప్పారు. దీంతో ఇప్పటికే మూడుసార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామనీ, ప్రభుత్వానికి ఇంకెన్నిసార్లు భూములివ్వాలని రైతులు అభ్యంతరం తెలిపారు. మరోమారు భూసేకరణ పిడుగు పడడంతో వారు ఆందోళనలో ఉన్నారు. దేశంలో అనేక ముఖ్య నగరాల్లో ఒఆర్ఆర్, జాతీయ రహదారులు 70 మీటర్ల వెడల్పుతో నిర్మించగా అమరావతి రింగురోడ్డును 250 మీటర్ల వెడల్పుతో నిర్మించే ప్రతిపాదన సరికాదు. రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్ఎఐ) డిపిఆర్ కూడా సిద్ధం చేసి, ముందుకు పోతుండడం రైతుల ప్రయోజనాలు దెబ్బతీయడమే. వారికి భూమికి భూమి ఇచ్చివుంటే సమస్యలు వచ్చి ఉండేవి కావు. రాజధాని నిర్మాణం, పట్టణాభివృద్ధి పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేయడం సరైన పద్ధతికాదు. అమరావతి కోసం తొలి దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు డెవలప్ చేసిన ప్లాట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. భూ యజమానులకు కౌలు, పేదలకు పింఛన్లు సరిగా అందడం లేదు. ఇబ్బందులిలా వుండగానే ఏలినవారు రెండవ దశ, అనంతరం మరింత విస్తరించడానికి భూములు సమీకరిస్తామని ఊరూరా తిరుగుతుంటే అన్నదాతల గుండెలు అదురుతున్నాయి. అదేపనిగా వేల ఎకరాలు సేకరించడం వెనక రియల్ మోసం ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తొలుత రాజధాని కోసం ప్రతిపాదించిన భూమితో సరిపెట్టుకోకుండా మరోమారు భూసేకరణకు దిగారు. ఇప్పుడు ఓఆర్ఆర్ ప్రతిపాదిస్తున్న మండలాలు, గ్రామాల పరిధిలో భూములు చాలా విలువైనవి. రైతులు, కూలీల జీవనం వాటిపైనే ఆధారపడి ఉంది. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్లో కోటి రూపాయల నుండి రెండుకోట్ల వరకూ ఉంటుంది. భూములు కోల్పోయే రైతులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వకుండా కొన్ని గ్రామాల్లో సచివాలయాల ముందు భూముల సేకరణకు సంబంధించి సర్వే నెంబర్లు, ఎల్‌పి నెంబర్లు సేకరించే భూమి విస్తీర్ణం వంటి వివరాలతో నోటీసులు అతికించారు. ఇందులో ఏ రైతు భూమిని ఎంత విస్తీర్ణం ప్రభుత్వం సేకరించబోతోంది వంటి వివరాలు రైతుల వారీగా లేకపోవడంతో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం పత్రికల్లో చేసిన ప్రకటన, సచివాలయాల్లో వేలాడదీసిన పత్రాలు పారదర్శకంగా లేకపోవడంతో రైతులు భయాందోళనల్లో ఉన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరిపి సామాజిక ప్రభావ అంచనా వివరించి రైతులు, ప్రజల సమ్మతి పొందడం అవసరం.

అటువంటి చట్టబద్ధమైన ప్రక్రియ అమరావతి ఔటర్‌రింగు రోడ్డు ప్రతిపాదిత గ్రామాల్లో ఇప్పటి వరకూ ఎక్కడా చేపట్టకపోవడం ప్రభుత్వానికి తగదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉన్న భూముల రేటుకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్న రైతుల కోర్కె ఎంతో సమంజస మైనది. నయాయబద్ధమైనది కూడా. ఆ ప్రాంతంఅభివృద్ధి చెందితే భూముల విలువలు ఎంతగానో పెరుగుతాయని భూ సమీకరణకు రైతులను అంగీకరింపజేయడానికి చెప్పిన ఏలికలు ఆ రైతులకు ఇప్పటి మార్కెట్ విలువనైనా పరిహారంగా చెల్లించలేదు. ఆర్ఆర్‌లో భూమి కోల్పోతున్న ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 71 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు.

# గ్రామ, పట్టణాల అభివృద్ధి లక్ష్యం కావాలి !

గ్రామాలు, పట్టణాల ఎన్నికలు పూర్తిక ఆవడంతో ఇక అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాగించే బాధ్యత సిఎం రేవంత్‌పై ఉంది. ఎన్నికల్లో ఎన్ని రాజకీయాలు చేసినా, అభివృద్ధి విషయంలో సమన్వయంతో అందరినీ కలుపుకుని పోవాల్సి ఉంటుంది. రానున్నది వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాల్సి ఉంది. మంచినీరు, పారిశుద్యం లాంటి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామస్థాయిలో అవినీతి విపరీతంగా ఉంది. పంచాయితీ వ్యవహారాలను, మున్సిపల్ వ్యవహారాలను పారదర్శకంగా సాగించాలి. పూర్తిస్థాయి కంప్యూటీకరణతో పనులను వేగంగా జరిగేలా చూడాలి. ఎందుకంటే అవినీతిరహిత, పారదర్శక పాలన అన్నది గ్రామాల నుంచే ప్రారంభం కావాలి. మున్సిపాలిటీల్లో కూడా పారదర్శక విధానాలకు పెద్దపీట వేయాలి. మంచినీరు, పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిధుల విడుదలలో కూడా రాజకీయాలు లేకుండా చూడాలి. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర అత్యంత కీలకం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు, మున్సిపల్ ఛైర్మన్లకు పాలనా పరమైన అవగాహన కల్పించాలి. ఇప్పటికే పంచాయతీల సర్పంచ్‌లకు విడతల వారీగా శిక్షణ అందిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్లకు, వైఎస్ ఛైర్మన్లకు కూడా శిక్షణ అందించాలని సిఎం నిర్ణయించారు. అందువల్ల పాలనా పరంగా ప్రజలకు సేవ చేసేలా శిక్షణ ఇవ్వాలి. చేయిచాపే విధానాలకు స్వస్తిపలకాలి. ఈ విషయంలో వారికి కఠినమైన ఆదేశాలు ఇవ్వాలి. పంచాయతీరాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్పంచ్‌లు గ్రామంలో జరుగుతున్న ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఇకపోతే కొత్తగా కొలువుదీరిన మున్సిపల్ పాలకవర్గాలకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇచ్చిన హామీలను నెరవేర్చడం సవాల్‌గా మారనుంది. పట్టణాల్లో ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీలు కంపుకొడుతున్నాయి. అనేక వార్డుల్లో తాగునీటి సమస్యల నెలకొన్నది. విలీన గ్రామాలు, శివారు పల్లెల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. మున్సిపాలిటీల్లో పాలన గాడి తప్పింది. మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. మరోపక్క పట్టణాలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపడుతున్నా, పట్టణ ప్రణాళికశాఖ అడ్డుకోలేకపోతున్నది. పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా, పనులు ప్రారంభంకాక పోవటంతో అభివృద్ధికి నోచుకోవడంలేదు. మరోపక్క పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టడం లేదు. ఇన్ని సమస్యలు, సవాళ్ల మధ్య కొత్త పాలకవర్గం బోధన్ మున్సిపాలిటీలో పాలనా పగ్గాలు చేపట్టింది. వీధి కుక్కల బెడద గ్రామాలు మొదలు, పట్టణ్యాల వరకు ఉంది. కోతుల సమస్య అత్యంత దారుణంగా ఉంది. వీటి నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకుంటే ఇదో పెద్ద సమస్యలగా పరిణమించడం ఖాయం. దోమలు విజృంభిస్తున్నాయి. దీనికితోడు అంటువ్యాధుల బెడద ఉంది. మిషన్ భగీరథ పేరుతో ఊదరగొట్టినా పాత మంచినీటి పథకాలకే కొత్తగా పేరు పెట్టారు. ఎక్కడా సక్రమంగా మంచినీటి వ్యవస్థ లేకుండా పోయింది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పలు పట్టణాల్లో కొత్తగా వెలసిన శివారు కాలనీలకు తాగునీరు అందడంలేదు. తరచుగా తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోతున్నాయి. తాగునీటి లీకేజీలను అరికట్టడం మున్సిపాలిటీలకి సమస్యగా మారింది. ఈ దశలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 'అమృత్ 2.0' పథకం కింద పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. వచ్చే వేసవినాటికి తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు పూర్తిచేయాల్సిన బాధ్యత కొత్త పాలకవర్గంపై ఉంది. పెద్ద గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చారు. పలు శివారు గ్రామాలను కలిపేసారు. మున్సిపాలిటీలో పదేండ్ల క్రితం చుట్టుపక్కల ఉన్న గ్రామాలు విలీనమయ్యాయి. అక్కడి ప్రజలపై పన్నుల భారం పెరిగిందే తప్ప, అందుకు తగిన అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. ముఖ్యంగా పట్టణ శివారుల్లోని కాలనీలు కనీసం రోడ్లు, డ్రైనేజీలకు నోచుకోవడం లేదు. శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణాల్లో కొన్నిచోట్ల దాతల సహకారంతో పునర్నిర్మించినా వందలవేల సంఖ్యలో శ్మశాన వాటికలు అధ్వా న్నంగా ఉన్నాయి. ఇకపోతే ఇంటింటికీ చెత్త సేకరణ రోజు విడిచి రోజు జరుగు తున్నప్పటికీ, ఈ సేకరణ సక్రమంగా జరగడంలేదు. పారిశుధ్య కార్మికుల కొరత, సరిపడా చెత్త వాహనాలు లేకపోవడం ఇందుకు కారణం. పెద్ద రోడ్లను శుభ్రపరిచే స్వీపింగ్‌మెషిన్లను రంగంలోకి దింపాల్సి ఉంది.

# లింగ నిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం మోపాలి

## - కమిటీ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిజామాబాద్, ఆగస్టు 18 ( ప్రజాగళం ప్రతినిధి )**పుట్టబోయే శిశువు అమ్మాయా, అబ్బాయా అని తెలియజేసేందుకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. పుట్టబోయేది ఆడ శిశువు అని నిర్ధారణ చేసి, గర్భవిచ్ఛిత్తికి పాల్పడడం క్షమించరాని నేరమని, ఇది ఎంతో శోచనీయమని అన్నారు. ఈ తరహా చర్యలకు పాల్పడే వారిని ఎంతమాత్రం ఉపెక్షించకుండా, బాధ్యులపై ఎం.టి.పి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వీ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం గర్భస్థపూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లింగ నిర్ధారణ పరీక్షల నిరోధానికి చేపడుతున్న చర్యల విషయమై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకుని నివేదికలు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ పనితీరు ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నామ్ కే వాస్తేగా సమావేశాలు నిర్వహించి తీర్మానాలు రాసుకోవడంతోనే సరిపెట్టుకోకుండా, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై క్షేత్ర స్థాయిలో గట్టి నిఘా ఉంచాలని అన్నారు. జనన వివరాలను అనుసరిస్తూ ఆడ, మగ నిష్పత్తిలో ఎక్కువ వ్యత్యాసం ఉంటే, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు భావించాల్సి వస్తుందన్నారు. ఈ తరహా వ్యత్యాసం ఎక్కువగా నగరాలు, పట్టణ ప్రాంతాలలోనే కనిపిస్తోందని, దీనిని బట్టి గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు తెలుస్తోందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో గట్టి నిఘా ఉంచితే ఈ తరహా అమానవీయ ఘటనలకు ఆస్కారం ఉండదని సూచించారు. ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా, వాటి అమలు సక్రమంగా లేకపోతే ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇకపై జిల్లాలో ఎక్కడ కూడా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరుగకుండా గట్టి నిఘా పెట్టాలని, నిబంధలను అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేయాలని, స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భం దాల్చిన నాటి నుండి గర్భిణీల వివరాలను పక్కాగా నమోదు



చేయాలని, వారిలో ఎంతమందికి కాన్పు జరిగిందన్నది పరిశీలించాలన్నారు. గర్భం దాల్చిన మీదట కాన్పు జరగని కేసులను క్షుణ్ణంగా పరిశీలిస్తే, గర్భ నిర్ధారణ, గర్భ విచ్ఛిత్తి ఘటనలను గుర్తించేందుకు ఆస్కారం ఉంటుందని, తద్వారా ఈ చర్యలకు పాల్పడిన స్కానింగ్ సెంటర్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పక్కాగా నిబంధనలు పాటించే స్కానింగ్ కేంద్రాలకే లైసెన్సులు రెన్యూవల్ చేయాలని ఆదేశించారు. పి.సి.పి.ఎన్.డి.టి, ఎం.టి.పీ చట్టాలను ఉల్లంఘించడం వల్ల సమాజంలో స్త్రీ, పురుషుల నిష్పత్తి గణనీయంగా తగ్గిపోతున్నదని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. పుట్టబోయే శిశువు ఆడ, మగ ఎవరైనా సరే, అందరూ సమానమే అని ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలిగించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, కమిటీ సభ్యులు ఎస్.సిద్దయ్య, బి.ఆంజనేయులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి....13 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్....రూ:44,330లు,10 సెల్ ఫోన్లు స్వాధీనం బోధన్ రూరల్ ఎస్ఐ రాజశేఖర్...



**బోధన్ ప్రతినిధి.ఆగస్టు 18: (ప్రజా గళం)**బోధన్ మండలం కొప్పర్గ గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో మంగళవారం బోధన్ రూరల్ ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 13 మంది పేకాటరాయుళ్లను అదు పులోకి తీసుకుని వారి వద్ద నుంచి 44,330 రూపాయ లు నగదు,10 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసి,చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట,మట్కా వంటి జూదం,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ రాజశేఖర్ హెచ్చరించారు.

# కింది స్థాయి నుంచి,ఉన్నత స్థాయికి ఎదిగి,ప్రజలతో మమేకమవుతూ,అధికారులు వృత్తి ధర్మాన్ని నిర్వహి స్తూ పనిచేయడం ఎంతో గర్వకారణం.....

## - ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్ వెల్లడి....ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల అసోసియేషన్ ఆధ్వ ర్యంలో, ఉత్తమ ఉద్యో గులుగా అవార్డు అందుకున్న బోధన్ తహసీల్దార్, పట్టణ సిఐ లకు ఘనంగా సన్మానం....

**బోధన్ ప్రతినిధి,ఆగస్టు 18: (ప్రజా గళం)**కింది స్థాయి నుంచి,ఉన్నత స్థాయి అధికారిగా ఎదిగి, ప్రత్యక్షంగా ప్రజలతో మమేకమవుతూ,వాళ్ళ వృత్తి ధర్మాన్ని ఎంతో గొప్పగా నిర్వహించే అధికారులుగా బోధన్ లో పనిచేయడం చాలా గర్వకారణంగా ఉందని ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్ అన్నారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణంలోని ఇందూర్ హై స్కూల్ ల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోధన్ నుండి ఉత్తమ ఉద్యోగులుగా అవార్డు అందుకున్న బోధన్ తహసీల్దార్ విట్టల్ ని,పట్టణ ఎస్ హెచ్ఓ వెంకటనారా యణలను మంగళవారం ప్రైవేట్ పాఠశాలలు,కళాశాల ల అసోసియేషన్ ఆధ్వర్యంలో వారిని శాలువ కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కొడాలి కిషోర్ మాట్లాడుతూ..15 ఆగస్టున ఉత్తమ ఉద్యోగులుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు,పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి చేతులు మీదు గా అవార్డులు అందుకోవడం చాలా సంతోషంగ ఉంద ని పేర్కొన్నారు. అలాగే బోధన్ నియోజకవర్గ అభివృద్ధి లో మీ ఇద్దరి పాత్ర చాలా ముఖ్యమైనదని కొనియాడా రు. మరికొందరు వక్తలు మాట్లాడుతూ..గత సంవత్సరం అధిక వర్షాల వల్ల హంగర్గ గ్రామం మునిగిపోవడం అప్పుడు తహసీల్దార్ విట్టల్ చేసినటువంటి కృషి తోపా టు,అందరిని సమన్వయం చేసుకోవడం,ప్రజలకు అధికారులకు,నాయకులకు వారధిగా నిలవడం అభినంద నీయమని తెలిపారు. పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టి న నాటి నుండి అన్ని పాఠశాలల్లో,కళాశాలల్లో "షీ" టీమ్స్ ద్వారా గాని,ఇతర కార్యక్రమాలు శాంతిభద్రతల విషయంలో అలాగే స్వయంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది అని అన్నారు. ముఖ్యంగా పాఠశాలలో, కళాశాలలో విద్యార్థులకు సూచనలు చేయడం,నేటి కాలంలో యువత మత్తుకు బానిస కాకుండా ఆంటీ"డ్రగ్స్"కార్యక్రమాలు నిర్వహించడంలో సిఐ వెంకటనారాయన పాత్ర చాలా పెద్దది అని అన్నా రు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య,ట్రస్మ జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్,వివిధ పాఠశాల లు,కళాశాలల డైరెక్టర్స్ హరి కృష్ణ,శ్రీనివాస్,జయప్రకాష్ ,చక్రవర్తి,మిద్దెల రాజు , కృష్ణ మోహన్,సురేష్,దుష్యంత్,గుర్రం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు బోధన్ పట్టణంలో ఫిల్టర్ బెడ్ శుభ్రత పనులు...

### - నీటి సరఫరా నిలిపివేత.... ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ కోరారు....





**బోధన్ ప్రతినిధి,ఆగస్టు 18:(ప్రజా గళం)**బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ఫిల్టర్ బెడ్ శుభ్రత పనులు చేపడుతున్నందున బుధవారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ ఒక పత్రికాప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు అసౌకర్యాన్ని గమనించి ముందస్తుగా అవసర మైన నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. ఇందు కు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

### - శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
### -పోలీస్ కమీషనర్ సాయి చైతన్య వెల్లడి

**నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 18( ప్రజా గళం )**పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ ( కానిస్టేబుల్ / సబ్ – ఇన్స్పెక్టర్ ) ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశామని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలో గల నిరుద్యోగ యువతి , యువకులకు అర్హత కలిగిన అభ్యర్థులకు తెలంగాణ పోలీస్ శాఖ నియామకాలకు ఉపయోగపడే విధంగా ఉచిత పోలీస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ద్వారా అందించబడే గూగుల్ ఫామ్ లింక్ క్యూ ఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు ఫారం డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. 23 వ తేదీ ఆదివారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందన్నారు. నిజామాబాద్ డివిజన్ వారు విజయ రూరల్ ఇంజనీరింగ్ కాలేజ్ మాక్లూర్ పోలీస్ స్టేషన్,ఆర్మూర్ డివిజన్ వారు క్షత్రియ ఇంజనీర్ కాలేజీ ,బోధన్ డివిజన్ వారు జూనియర్ ఇంటర్ డిగ్రీ కాలేజీ లో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. పరీక్షా విధానం




ఆబ్జెక్టివ్ విధానం లో 200 మార్కులకు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని పైన తెలియజేసిన సెంటర్స్ నందు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు సెప్టెంబర్ 1 వ తేదీ నుండి అక్టోబర్ 31 తేదీ వరకు శిక్షణలో పాల్గొనవచ్చున్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు 2 నెలల శిక్షణ కాలంలో 10 గ్రాండ్ టెస్ట్ లు నిర్వహించబడుతుందన్నారు . అభ్యర్థులందరికి ఉచిత స్టడీ మెటీరియల్ అందించబడుతుందన్నారు. ఇ ది పూర్తిగా ఉచిత కార్యక్రమమని, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఎలాంటి సమాచారానికైనా క్రాంతి- 9951943656 , 8712533273. ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

### -అదనపు కలెక్టర్ భుజంగరావు
### - ఘనంగా జయంతి వేడుకలు



**నిజామాబాద్, ఆగస్టు 18 ( ప్రజాగళం ప్రతినిధి )** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వినాయకనగర్ లో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి అదనపు కలెక్టర్ భుజంగరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జయంతి వేడుకల సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ప్రభుత్వం




అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. దౌర్జన్యాలు, అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి సర్వాయి పాపన్న అని గుర్తు చేశారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నుల వ్యవస్థ లేని గొప్ప పరిపాలనను పాపన్న గౌడ్ అందించారని కొనియాడారు. గోల్కొండ కోటను సైతం పాలించడం సర్వాయి పాపన్న ధైర్య సాహసాలను చాటుతోందన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ మార్గదర్శకత్వం ఎంతో అనుసరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బీసీ సంఘాల నాయకులు, గౌడ సంఘాల ప్రతినిధులు, గీత వృత్తిదారులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కర ఏర్పాట్ల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

### - అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం
### - యంచ వద్ద పుష్కరఘాట్ నిర్మాణానికి అనువైన స్థలం పరిశీలన

**నిజామాబాద్, ఆగస్టు 18 ( ప్రజాగళం ప్రతినిధి)** గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నవీపేట మండలం యంచ వద్ద పుష్కర ఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి అనువైన స్థలం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో ముఖాముఖి భేటీ అయి, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. యంచ గ్రామ శివారులో ఎక్కడ పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తే భక్తులకు అనుకూలంగా ఉంటుంది, అవసరమైన స్థలం అందుబాటులో ఉందా, రవాణా వసతి, ఇతర సదుపాయాలు, భద్రతాపరమైన అంశాలు తదితర వాటి గురించి సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అన్ని అంశాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని, ప్రభుత్వం నిర్ధారణ చేసిన ప్రాంతంలోనే పుష్కరఘాట్ నిర్మాణం చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిశీలన జరిపిన ప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఏమేరకు అందుబాటులో ఉంది, పట్టా భూములు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయన్నది పక్కాగా సర్వే నిర్వహించి వారం రోజుల్లోపు మార్కింగ్ పూర్తి చేయాలని



స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను అట్టహాసంగా నిర్వహించేలా ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా, విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా పనులను చేపట్టి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర దేవాలయం యంచ గ్రామానికి అత్యంత చేరువలో ఉన్నందున గోదావరి పుష్కర పుణ్య స్నానాల కోసం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున లోటుపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, ఇరిగేషన్, ఎండోమెంట్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

# ఎడపల్లిలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలు....

### - అణచివేతకు వ్యతిరే కంగా పోరాడి,బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.... కౌండిన్య గౌడ సంఘం అధ్యక్షుడు దయానంద్ గౌడ్,ఎం శేఖర్ గౌడ్ లు కొనియాడారు....

**ఎడపల్లి,ఆగస్టు 18:(ప్రజా గళం)**ఎడపల్లి మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి ఉత్సవాలను గౌడ కులస్తుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నయాబాదిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కౌండిన్య గౌడ సంఘం అధ్యక్షుడు కందనూరి దయానంద్ గౌడ్,కోశాధికారి ఎం.శేఖర్ గౌడ్ లు మాట్లాడుతూ..అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి,బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన చూపిన పోరాట పటి మ,ఆశయాలు నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆయన త్యాగాలు,సేవలను నిరంతరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మొఘల్, కుతుబ్‌షాహీ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలను,బహుజనులను ఏకం చేసి పాపన్న గౌడ్ సైన్యాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. పాపన్న గౌడ్ లాంటి మహనీ యులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని,ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్క రూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకుల నరస గౌడ్,ఆర్.ఎల్లా గౌడ్,పుట్ట నరస గౌడ్, కె. మల్లాగౌడ్,నవీన్




గౌడ్,బాలా గౌడ్,వంగ వెంకట్ స్వామి గౌడ్,రేణుక దాస్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్ట్ 24 నుంచి ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల బంద్ ను జయప్రదం చేయండి

## - దిఆటో డ్రైవర్ల జేఏసీ పిలుపు



**నిజామాబాద్,ఆగస్ట్ 18,ప్రజాగళం:**రాష్ట్ర ప్రభుత్వం ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి జరిగే ఆటో క్యాబ్ స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక బంద్ పోస్టర్లను జిల్లా కేంద్రంలోని కోటగల్లీ, ఎన్.ఆర్ భవన్లో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి, బీఆర్టియు, సీఐటియు, టీయుసీఐ, ఐఎఫ్టియు యూటీయూసీ, టిఆర్టియు అనుబంధ ఆటో కార్మిక సంఘాల బాధ్యులు హన్మండ్లు, షాదుల్లా, ఉ ద్ధవ్, గంగాధర్, సుధాకర్, శివకుమార్, రాములు, శ్రీనివాస్ లు మాట్లాడుతూ ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఓలా ఉబర్ రాపిడో యాప్ లకు బదులుగా ప్రభుత్వమే కొత్త యాప్ ను తీసుకురావాలన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12వేలు ఇవ్వాలన్నారు. రోజువారీగా ప్రజలకు సౌకర్యం కల్పించే ఆటో డ్రైవర్లకు ఈ చలాన్ ల నుంచి మినహాయించాలన్నారు. యాక్సిడెంట్ బీమాను కొనసాగించాలని, 50 సంవత్సరాలు పూర్తయిన డ్రైవర్లకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 24 నుండి జరిగే ఆటో క్యాబ్ స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక బంద్ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో జేఏసీ నాయకులు జబ్బర్, హుస్సేన్, విఠల్, అబ్దుల్, గఫార్, సురేందర్, గణేష్, అక్లక్, ఇమ్రాన్, శ్రీనివాస్, రాజు, కృష్ణ ముజీబ్, ఇర్ఫాన్, రఫీయుద్దీన్ , నరసయ్య, ప్రభాకర్, నరేష్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

# క్యూట్‌లో ప్రతిభ ఐఏఎస్ లక్ష్యంగా అడుగులు..

**బాన్సువాడ,, ప్రజాగలం :** కష్టపడి చదివి, పట్టుదలతో లక్ష్యసాధన దిశగా అడుగులు వేస్తున్న అంబిలిపూర్ నమ్రత జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించింది. చిన్ననాటి నుంచే ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న నమ్రత, అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చదువుతూ విజయాలను అందుకుంటోంది.పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించిన నమ్రత, ఇంటర్మీడియట్‌లో నారాయణ కళాశాలలో 970 మార్కులు, 97 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (క్యూట్–యూజీ)లో ప్రతిభ కనబరచడంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఏ ఆంత్రోపాలజీ కోర్సులో ప్రవేశం లభించింది. హైదరాబాద్ యూనివర్సిటీ 2026–27 విద్యా సంవత్సరానికి క్యూట్–యూజీ ద్వారా ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తోంది.నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన క్యూట్ పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ ఉన్నప్పటికీ నమ్రత మంచి ప్రతిభ కనబరిచింది. ఐదు సబ్జెక్టుల్లో మొత్తం 1,250 మార్కులకు గాను 620 మార్కులు సాధించింది. దీంతో డిగ్రీతో పాటు పీజీ విద్యను ఐదేళ్లపాటు యూనివర్సిటీలో హాస్టల్ వసతితో అభ్యసించే అవకాశం దక్కింది.తన లక్ష్యం ఐఏఎస్ కావడమేనని నమ్రత తెలిపింది. ఇప్పటికే సివిల్స్ ఆన్‌లైన్ కోచింగ్‌కు అడ్మిషన్ తీసుకున్నానని, భవిష్యత్తులో అత్యుత్తమ ర్యాంకుతో ఐఏఎస్ సాధించి ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నట్లు పేర్కొంది.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించిన తమ కుమార్తె నమ్రత పట్ల తల్లిదండ్రులు అంబిలిపూర్ యశోద, రాజు (సీనియర్ జర్నలిస్ట్) హర్షం వ్యక్తం చేశారు. తమ కుమార్తె లక్ష్యసాధనకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని వారు తెలిపారు. చదువులో రాణిస్తున్న చిన్నారుని పలువురు అభినందనలతో ముంచేత్తుతున్నారు.



# మళ్లీ గుడివాడ రాజకీయాల్లోకి నాని

విజయవాడ, : మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ రాజకీయాల్లోకి మళ్లీ ఎంట్రీ ఇచ్చారు. సుదీర్ఘ విరామం తర్వాత క్రియాశీల రాజకీయ కార్యక్రమంలో ప్రత్యక్షమయ్యారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో ఆయన పాల్గొన్నారు. గతంలో కోర్టు వాయిదాలకు.. ముందస్తు బెయిల్ షరతుల్లో భాగంగా పోలీస్ స్టేషన్లలో సంతకాలు పెట్టడానికి వచ్చి వెళ్లిపోయేవారు. కానీ ఈ సారి రాజకీయ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చారు.మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న కొడాలి నాని, గవర్నర్‌కు అందించే వినతిపత్రంలో సంతకం చేశారు. ఆ తర్వాత, వినతి పత్రాలను జిల్లా కమిటీకి అందించే పార్టీ శ్రేణుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన పార్టీ శ్రేణులతో కొడాలి నాని మంచి సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు పునాదులు వేశారని కొడాలి నాని తెలిపారు. వైసీపీ పాలనలో ఐదు కళాశాలలు పూర్తి అయ్యాయన్నారు. మరో ఐదు కళాశాలల నిర్మాణం తుది దశకు చేరుకున్నాయని కానీ వాటిని పూర్తి చేయలేదన్నారు.

# ఫ్రీ క్యాన్సర్ వ్యాక్సిన్

మాస్కో : క్యాన్సర్.. ప్రస్తుతం సమాజంలో వేగంగా విస్తరిస్తున్న వ్యాధుల్లో ఇదీ ఒకటి. మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్లు, వాతావరణ పరిస్థితుల కారణంగా స్త్రీపురుష బేధం లేకుండా.. వయసుతో సంబంధం లేకుండా.. క్యాన్సర్ విస్తరిస్తోంది. ఇప్పటి వరకు చికిత్స తప్ప నివారణ లేని వ్యాధి. అయితే దీనికి రష్యా శుభవార్త చెప్పింది. క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ అభివృద్ధి చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందిస్తామని కూడా తెలిపింది. ఈ ఆవిష్కరణ ఆరోగ్య రంగంలో భారీ మలుపును తీసుకురావచ్చు.ఈ వ్యాక్సిన్ ఎమ్ఆర్ఎన్ఏ సాంకేతికతపై ఆధారపడి రూపొందించబడింది, ఇది శరీరంలో క్యాన్సర్ కణాలను గుర్తించి నశింపజేసే రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. మెలనోమా, లంగ్ క్యాన్సర్, ప్యాన్‌క్రియాస్ వంటి ఆరు ముఖ్య రకాలపై ప్రధానంగా పనిచేస్తుంది. రష్యా గమాలేయా జాతీయ ఎపిడెమాలజీ ? మైక్రోబయాలజీ రీసెర్చ్ సెంటర్‌లో అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌కు 'ఫ్యూచర్?వీ' అనే పేరు ప్రతిపాదించారు.మొదటి, రెండవ దశ ట్రయల్స్‌లో 100 మంది పైగా రోగులపై పరీక్షలు విజయవంతమయ్యాయి. ట్యూమర్ పరిమాణం 30?50% తగ్గడం, రోగ నిరోధకత పెరగడం గమనించారు. మూడవ దశ 2026లో ప్రారంభం కానుంది, ఇందుకు డబ్ల్యూహెచ్‌వో, ఈఎంఏ ఆమోదాలు కోరుతున్నారు.2026 చివరి నుంచి ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాక్సిన్ ఉచితంగా అందజేయనున్నారు. రష్యా ప్రభుత్వం, గమాలేయా సెంటర్, అంతర్జాతీయ సంస్థల సహకారంతో 10 కోట్ల డోసులు ఉత్పత్తి చేయబడతాయి. దిగువ ఆదాయ వర్గాలు, అభివృద్ధి చెడుతున్న దేశాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపింది. భారత్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలతో ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించింది. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి, కానీ పూర్తి డేటా ప్రచురణకు ఆందోళన వ్యక్తం చేశాయి. పేటెంట్ హక్కులు, ఉత్పత్తి సామర్థ్యం ప్రధాన సవాళ్లు. విజయం సాధిస్తే, క్యాన్సర్ మరణాలు 40% తగ్గవచ్చని నిపుణులు అంచనా.ఈ వ్యాక్సిన్ విస్తరణతో క్యాన్సర్ చికిత్స ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. పర్సనలైజ్డ్ మెడిసిన్‌కు మార్గం సుగమం అవుతుంది. మరిన్ని ట్రయల్స్ జరిగిన తర్వాత పూర్తి అమలు సాధ్యమవుతుంది.





# ఆగని పైరసీ..!

హైదరాబాద్: ఐబొమ్మ రవిపై పోలీసులు 4 రకాల కేసులు నమోదు చేశారు. ఇప్పటికే అతన్ని రెండుసార్లు కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించారు. అది ఏమాత్రం చాలలేదని చెబుతూ.. మళ్లీ కస్టడీ కోరారు. దాంతో కోర్టు.. 4 కేసుల్లోనూ కస్టడీకి అనుమతించింది. ఒక్కో కేసుకూ 3 రోజుల చొప్పున.. 12 రోజులు కస్టడీకి అనుమతించింది. అందువల్ల పోలీసులు గురువారం నుంచి మళ్లీ రవిని కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించడం మొదలుపెడతారు. ఇదంతా ఓకే.. కానీ అసలు సమస్య సాల్వ్ అవ్వలేదు.రవి అరెస్టు తర్వాత పైరసీ ఎక్కడా ఆగలేదు. కొత్తగా రిలీజ్ అవుతున్న అన్ని సినిమాలూ ఎప్పట్లాగే పైరసీఅవుతున్నాయి. ఒక్క సినిమా కూడా పైరసీ అవ్వకుండా ఆగింది లేదు.మరి రవిని అరెస్టు చేసి పోలీసులు సాధించింది ఏంటి? అనే ప్రశ్న వస్తోంది. అసలు పైరసీ ఎందుకు ఆగట్లేదు అనేది మనం లోతుగా ఆలోచించాల్సిన విషయం. ఎందుకు అంటే.. రవి.. ఏ కొత్త సినిమానూ డైరెక్టుగా పైరసీ చెయ్యలేదు. అంటే.. థియేటర్‌కి వెళ్లి.. రహస్యంగా వీడియో రికార్డులు చెయ్యడం వంటివి రవి చెయ్యలేదు. అతను ఇతర పైరసీ సైట్ల నుంచి పైరసీ సినిమాల్ని తీసుకొని.. ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. అందువల్ల అసలు పైరసీ సైట్లు అలాగే ఉన్నాయి. వాటిని పోలీసులు బ్రేక్ చెయ్యలేకపోతున్నారు. రవి దొరకగానే.. అతనే పైరసీ కింగ్ అని చెప్పారు. కానీ.. అతను పైరసీ మాఫియాలో చిన్న పార్ట్ మాత్రమే.మనకు ఇంకో డౌట్ రావచ్చు. ఓటీటీలో సినిమాల్ని అతను పైరసీ చేసేవాడు కదా. ఇక ఇప్పుడు ఆ పైరసీ ఆగిపోయినట్లే కదా అని. అంత లేదు. ఆ పైరసీ కూడా ఆగలేదు. రవి ఏం చేసేవాడంటే.. ఆఖీఓ టెక్నాలజీని వాడేవాడు. దీని ద్వారా ఓటీటీ సినిమాలను ప్లే చేస్తూ.. స్క్రీన్ రికార్డ్ చేసేవాడు.




# విద్వేషం.. హింస



స్ట్రేలియాలోని సిడ్నీ అత్యంత పాశవిక మారణకాండకు వేదికగా మారడం దిగ్భ్రాంతికరం. యూదులే లక్ష్యంగా తండ్రీ కొడుకులు తుపాకీ గుళ్ల వర్షం కురిపించడంతో పదేళ్ల బాలిక సహా 16 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 40 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా 'హనూకా' వేడుక చేసుకునేందుకు సిడ్నీలోని బొండీ బీచ్‌లో కొవ్వొత్తులు వెలిగించడానికి వచ్చిన చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ దుండగుల కాల్పుల్లో రక్తమోడడం అత్యంత బాధాకరం. మతపరమైన ద్వేషం, జాత్యహంకారం, విద్వేష ఉపన్యాసాలు, మీడియా, సోషల్ మీడియాలో విస్తరిస్తున్న ఉన్మాద భావనలు.. ఇవన్నీ ఇలాంటి దుర్మార్గాలకు ఆజ్యం పోస్తున్నాయి.

విద్వేషం మరింత విద్వేషాన్ని పెంచుతుందే కానీ..శాంతినీ, సామరస్యాన్నీ కలిగించదని గౌతమ బుద్ధుడు దగ్గర నుంచి అన్ని మతాల ప్రవక్తలు ప్రకటిస్తున్నదే! యూదులపై ద్వేషభావం ఆస్ట్రేలియా సమాజాన్ని కలుషితం చేస్తోందని, అక్కడి ప్రభుత్వ విధానాలు ఆ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయంటూఈ ఘటన జరిగిన వెంటనే ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ ఊగిపోయారు. చిన్నారులు, మహిళలు అన్న కనికరంగానీ, ఆకలి తీర్చుకునేందుకు క్యూలో నిలబడ్డారన్న ఇంగితం కానీ, ఆసుపత్రిలో కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారన్న జ్ఞానం కానీ లేకుండా అమానుషంగా 70 వేల మందికిపైగా అమాయకులను ఊచకోత కోసిన నెతన్యాహు సర్కారు, దానికి అండదండలిచ్చిన అమెరికా లాంటి పశ్చిమ దేశాలే ఇలాంటి మారణ హోమాలకు సంజాయిషీ చెప్పాలి.

పాలస్తీనాపై నరమేధం తర్వాత ఆస్ట్రేలియాలో యూదు వ్యతిరేక ఘటనలు 316 శాతం పెరగడం, రెండు వేల కంటే ఎక్కువ కేసులు నమోదవడమే ఇందుకు సాక్ష్యం. ప్రాణాలకు తెగించి ఓ దుండగుడి చేతిలోని తుపాకీ లాక్కుని అనేకమంది ప్రాణాలను కాపాడిన అహ్మద్ అల్ అహ్మద్‌కు ప్రపంచమంతా సెల్యూట్ చేస్తోంది. పహల్గాం ఉగ్రదాడి సందర్భంలో టూరిస్టులను కాపాడి, ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా అందరికీ గుర్తొస్తాడు. ఒకరికి ఒకరు వెలుగుగా ఉండాలని, ఐక్యంగా ఉండాలని ఆస్ట్రేలియా ప్రధాని పిలుపునివ్వడం, అహ్మద్‌ను ఆసుపత్రిలో కలిసి అభినందించడం మంచి పరిణామం. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరగడంతో తుపాకీ నియంత్రణ చట్టాలను ఆస్ట్రేలియా అమలు చేస్తోంది. వాటికి మరింత పదును పెట్టడం, దోషులను కఠినంగా శిక్షించడం, సమాజంలో సోదర భావాన్ని పెంపొందించడం అత్యవసరం.

ఒక ఘటన జరగ్గానే ఆ మతానికి చెందిన ప్రతి ఒక్కరినీ ద్వేషంతో చూడటం మొదలు పెడితే సమాజం విడిపోతుంది. మెజారిటీ, మైనారిటీ మతోన్మాదులు కోరుకునేది ఇదే. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్ఎస్ఎస్‌తోపాటు సంఘ్ పరివార్‌లోని విహెచ్‌పి, బజరంగ్‌దళ్ లాంటి సంస్థలు రెచ్చిపోతున్నాయి. మైనారిటీలంతా శత్రువులు, జీహాదీలని, వారిపై దాడులు చేయడం ధర్మ రక్షణ అని, మసీదులు, చర్చిలపై దాడులు చేయడం హీరోయిజం అని యువతను పక్కదోవ పట్టించడం, అందు కోసం అలవోకగా అబద్ధాలను ప్రచారం చేయడం అత్యంత ప్రమాదకరం. గోడీ మీడియాతోపాటు సోషల్ మీడియా కూడా అందుకు ఇతోధికంగా సహకరించడం తగదు.

అమెరికా, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో మైనారిటీగా వున్న హిందువులపై దాడులు జరిగినప్పుడు విహెచ్‌పి లాంటి సంస్థలు మొసలి కన్నీరు కారుస్తున్నాయి. విద్వేషం ఏ దేశంలోనైనా మైనారిటీలకు ముప్పుగా పరిగణిస్తుందనేది జగమెరిగిన సత్యం. జాత్యహంకారం, విద్వేషాన్ని పెంచి పోషిస్తే.. అది తిరిగి వారినే కాటేస్తుందనడానికి పక్కనే ఉన్న పాకిస్తాన్ లాంటి దేశాల్లో నిత్యం సాగుతున్న ఉగ్రవాద ఘటనలే ఉదాహరణ. భిన్నత్వం లో ఏకత్వాన్ని, లౌకికవాదాన్ని, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని, రాజ్యాంగ విలువలను రక్షించుకోవడమే భారతీయత. సమాజంలో, రాజకీయాల్లో పెరుగుతున్న ద్వేషాన్ని తిప్పికొట్టడంతోపాటు అహ్మద్‌లాంటివారి కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే స్ఫూర్తిని మనసు నిండా నింపుకోవడం తక్షణ కర్తవ్యం. విద్వేషాన్ని విడనాడి మానవత్వమే మతమని, అభిమతమని, అత్యున్నతమని ప్రతి ఒక్కరూ ప్రతిన బూనడమే ఇలాంటి మారణహోమాలకు విరుగుడు.

# డిజైనింగ్ లోపాలతో నిండుతున్న రైల్వే అండర్ బ్రిడ్జులు

## -శాశ్వత పరిష్కారం కోరిన ఎంపీ గురుమూర్తి

తిరుపతి :తిరుపతి పార్లమెంట్ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జ్‌ల వద్ద వర్షాకాలంలో తలెత్తుతున్న సమస్యల గూర్చి తిరుపతి ఎంపీ గురుమూర్తి పార్లమెంటులో ప్రస్తావించారు. చిన్నపాటి వర్షాలకే కొన్ని అండర్ బ్రిడ్జ్‌ల వద్ద నీరు నిలవడంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారడం తోపాటు ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి దృష్టికి తీసుకెళ్లారు.ఈ ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ సమాదనం ఇచ్చారు. దేశవ్యాప్తంగా రైల్వే అండర్ బ్రిడ్జ్‌లు, సబ్‌వేలలో నీరు నిలిచిపోకుండా డ్రైనేజ్ వ్యవస్థలు, నీటి మళ్లింపు మార్గాలు, క్రాస్ డ్రైన్లు, జాయింట్ సీలింగ్, ఎంట్రీ వద్ద హంప్‌లు, కవర్ల షెడ్‌లు, అత్యవసర పంపింగ్ ఏర్పాట్లు వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే అసాధారణ వర్షపాతం సమయం లో ట్రాఫిక్ నిలిపివేయడం, హెచ్చరిక బోర్డులు, గేటు బారియర్లు, వాచ్‌మన్‌ల నియామకం వంటి భద్రతా చర్యలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు.తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి, మొత్తం 43 రైల్వే అండర్ బ్రిడ్జ్‌లు ఉన్నాయని, గత వర్షాకాలంలో గూడూరు, రేణిగుంట సెక్షన్ లో చెర్లోపల్లి, కాపుగున్నేరి, రాచగున్నేరి లోని మూడు అండర్ బ్రిడ్జ్‌ల వద్ద నీరు నిలిచి సమస్య వచ్చిందని, దానిని పంపింగ్ ద్వారా పరిష్కరించినట్లు సమాధానంలో పేర్కొన్నారు. అలాగే తిరుపతి నియోజకవర్గంలో రూ.208 కోట్ల వ్యయంతో 6 చోట్ల రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జ్‌లు నిర్మించేందుకు అనుమతులు ఇచ్చినట్లు తెలియజేశారు. మొత్తంగా సమస్య ఉందని ప్రభుత్వం గుర్తించిందని, తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత పరిష్కా రాల దిశగా పనులు జరుగుతున్నా యని మంత్రి తన సమాదనంలో తెలియజేశారు. అయితే డిజైన్ లోపాలపై ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు నిర్ణయించినట్లు స్పష్టమైన వివరాలు ఇవ్వలేదు. స్థానిక మున్సిపల్ సంస్థలతో సమన్వయంతో సమగ్ర డ్రైనేజ్ పరిష్కారాలపైపని చేస్తున్నామని మాత్రమే తెలిపారు. ఈ అంశంపై ఎంపీ గురుమూర్తి స్పందిస్తూ రైల్వే అండర్ బ్రిడ్జ్‌లలో వర్షాకాలం నీరు నిలవడం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.చిన్నపాటి వర్షం పడినా కూడా కొన్ని అండర్ బ్రిడ్జ్‌లు నీటితో నిండిపోవడం చూస్తుంటే స్పష్టమైన డిజైన్ లోపాలు, సమగ్ర డ్రైనేజ్ ప్రణాళిక లేకపోవడాన్ని సూచిస్తుందని ఆయన పేర్కొన్నారు. తాత్కాలిక పంపింగ్ ఏర్పాట్లకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారాలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జ్‌లలో సరైన డ్రైనేజ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న అండర్ బ్రిడ్జ్‌లలో డిజైన్ ఆడిట్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ చర్యలు తీసుకోవాలని ఎంపీ గురుమూర్తి కోరారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com